క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె రూరల్: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 4వ తేదీ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయబడునని ఆ శాఖ ఏఈ శివనాగిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పల్స్ ఆసుపత్రి నుంచి కిసాన్‌నగర్ వరకు విద్యుత్ నిలుపుదల చేయబడునని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

భట్టిప్రోలు ఏవోగా లక్ష్మీప్రసన్న బాధ్యతల స్వీకారం



భట్టిప్రోలు: భట్టిప్రోలు మండల వ్యవసాయ శాఖాధికారిగా కారంకి లక్ష్మీప్రసన్న శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆమె అమృతలూరు మండలం ఏవోగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన వ్యవసాయ శాఖాధికారి గొల్లపోతు మీరయ్య ఉద్యోగోన్నతిపై విజిలెన్స్ ఏవోగా ఏలూరు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ మండలంలో రైతులకు అందుబాటులో ఉండి తన వంతు సహాయ సహకారాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఎరువులు, పురుగు మందులు, వరి, మినుము, పెసలు, మొక్కజొన్న విత్తనాలు సబ్సిడీపై అందించేందుకు ఎప్పటికప్పుడు సమాచారం అందించనున్నట్లు తెలిపారు. అలాగే వ్యవసాయ పరికరాల సబ్సిడీ వివరాలను కూడా రైతులకు తెలియజేయనున్నట్లు వివరించారు.

ఐలవరంలో కొనసాగుతున్న మేలుకొలుపు

ఐలవరం(భట్టిప్రోలు): ధనుర్మాసం పురస్కరించుకుని సమరసత సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో భట్టిప్రోలు మండలం ఐలవరం వేణుగోపాలస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న మేలుకొలుపు నిర్విఘ్నంగా కొనసాగుతుంది. ప్రతి రోజు ఐలవరం పురవీధుల్లో నగర సంకీర్తన నిర్వహిస్తున్నారు. మేలుకొలుపు నిర్వహిస్తున్న నగర సంకీర్తన సభ్యులను శుక్రవారం రామిశెట్టి సత్య మోహనరావు ఘనంగా సన్మానించారు. ఎస్ఎస్ఎఫ్ బాపట్ల జిల్లా డివిజన్ ధర్మ ప్రచారక్ జంజనం హేమ శంకరరావు మాట్లాడుతూ ఈ మాసమంతా విష్ణు దర్శనం, విష్ణు నామ సంకీర్తనం చేయడం వల్ల సకల సౌభాగ్యాలు, సిరి సంపదలు కలుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎం.రంగారావు, పి.నాగేశ్వరరావు, కేబీవీ రమణ, వి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా జయంతి వార్షికోత్సవాలు



భట్టిప్రోలు: భట్టిప్రోలు రథం సెంటర్‌లోని షిర్డీ సాయిబాబా ఆలయంలో నిర్వహిస్తున్న 80వ ధనుర్మాస జయంతి వార్షికోత్సవాలలో భాగంగా శుక్రవారం తెల్లవారు జామున ఓంకారం, నగర సంకీర్తన, సుప్రభాతం, కాకడ హారతి నిర్వహించారు. సాయినాథుని పాదుకలకు అభిషేకాలు, బాబా వారికి తులసీ దళాలతో సహస్ర నామార్చన చేశారు. పూజా కార్యక్రమాలలో మానేపల్లి శ్రీనివాస్, హృదయలక్ష్మి, చీదెళ్ల ఉమామహేశ్వరరావు, శ్రీదేవి దంపతులు పాల్గొన్నారు. సాధన మండలి–బ్రహ్మ విద్యాశ్రమం వారిచే నారాయణోపనిషత్తు, భజ గోవిందం, గీతా పారాయణం, తత్వ సారం జరిగింది. హేమ వితలేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన బాలా త్రిపురసుందరి మహిళా సమాజం ఆర్గనైజర్ అల్లం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సాయిబాబా జీవిత చరిత్రలోని కొన్ని అంశాలు, లలితా, శ్రీలక్ష్మీ అమ్మవార్ల ప్రవచన స్తోత్రాలు, స్తుతులు, గేయాలు, దేవీ అశ్వధాటి స్తోత్రమ్ ఆలపించారు. రాత్రి అష్టోత్తర పూజలు, శేజ్ హారతి, ఊయల, పవళింపు సేవలు జరిగాయి. కార్యక్రమాలను దేవస్థాన కమిటీ అధ్యక్షులు తమ్మన రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి ఎం.సాంబశివరావు, కోశాధికారి బూర్లె కిరణ్‌కుమార్‌లు పర్యవేక్షించారు.

నిత్యావసరాలు అందజేత

రేపల్లె రూరల్: కృష్ణానది వరద బాధితులకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రేపల్లె బ్రాంచ్ శుక్రవారం చేయూతనిచ్చింది. ఈ సందర్భంగా మండలంలోని పెనుమూడి ఎస్టీ కాలనీలోని 57 బాధిత కుటుంబాలకు వంట సామగ్రి, నిత్యావసర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ వసంతం వీరరాఘవయ్య, సభ్యులు కరిముల్లా, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం విక్రేత అరెస్ట్

రేపల్లె రూరల్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న ఘటన ఉప్పూడి అడ్డరోడ్డు వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ దివాకర్ మాట్లాడుతూ తమకు అందిన సమాచారంతో గ్రామంలో దాడులు నిర్వహించగా ఊలుపాలెంకు చెందిన దోనేపూడి కోటేశ్వరరావు అనే వ్యక్తి ఉప్పూడి అడ్డరోడ్డు వద్ద మద్యం విక్రయిస్తూ పట్టుబడ్డాడన్నారు. దాడులలో అతని వద్ద నుంచి 11 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశామన్నారు.

వేరుశనగ సాగుపై రైతుల ఆసక్తి



తాడివాకవారిపాలెంలో వేరుశనగ విత్తనాలు వేస్తున్న వ్యవసాయ కూలీలు



నగరంలో యంత్రాలతో వేరుశనగ విత్తనాలు వేస్తున్న రైతులు

- పంట మార్పిడి విధానంలో రబీలో వేరుశనగ పంటకు మొగ్గు
- ముమ్మరంగా సాగు పనులు
- పెట్టుబడి ఎక్కువైనా దిగుబడి, ధర ఆశాజనకం

నగరం: రబీ సీజన్‌లో రైతులు వేరుశనగ పంట సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. వ్యవసాయ శాఖాధికారులు పంట మార్పిడి విధానాన్ని అనుసరించాలని రైతులకు సూచించడంతో ఆ దిశగా రైతులు చర్యలు చేపడుతున్నారు. గతంలో వేరుశనగ పంటను కొద్ది మంది మాత్రమే సాగు చేసేవారు. కానీ ఈ ఏడాది రబీలో వేరుశనగ సాగుకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. గతంలో ఈ ప్రాంతంలో రబీలో మినుము, పెసర, మొక్కజొన్న, తెల్లజొన్న పంటలను ఎక్కువగా సాగు చేసేవారు. అయితే మినుముకు పల్లాకు, వైరస్ తెగుళ్లు ఆశించడంతో రైతులు మొక్కజొన్న సాగు వైపు దృష్టి సారించారు.

+ మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు ఆశించి రైతులకు అపార నష్టం వాటిల్లుతుండటంతో ఈ సాగుకు విరామం ప్రకటించాలని వ్యవసాయ నిపుణులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలోనే రైతులు వేరుశనగ పంట వైపు మొగ్గు చూపారు.

+ వేరుశనగ సాగుకు అవసరమైన విధంగా పంట పొలంలో దుక్కులు చేయించి విత్తనాలు వేసే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.

పెట్టుబడి ఎక్కువ

మండలంలోని నగరం, తాడివాకవారిపాలెం, ఈదుపల్లి, కమ్మవారిపాలెం, పెదమట్లపూడి, చినమట్లపూడి తదితర గ్రామాలలో సుమారు 5 వేల ఎకరాలలో వేరుశనగ సాగు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. వేరుశనగ పంటకు పెట్టుబడి అధికమైన రైతులు పంట మార్పిడిలో భాగంగా వేరుశనగ సాగుకు ఉపక్రమిస్తున్నారు.

దీనిలో భాగంగా వేరుశనగ సాగు పనులు ముమ్మరంగా చేస్తున్నారు. పంట పొలాలను బాగా కలియ దున్ని యంత్రాలతోను, ఎద్దుల నాగలితో వేరుశనగ విత్తనాలను వేసే పనిలో రైతులు ఉన్నారు. వేరుశనగ పంటలో ఆశించిన దిగుబడులు రావడంతో పాటు గిట్టుబాటు ధర కూడా ఆశాజనకంగా ఉండటంతో రైతులు పంటను సాగు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీలో ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం

వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్



నూతన కమిటీ సభ్యులతో డాక్టర్ గణేష్

రేపల్లె రూరల్: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరిని అధిష్టానం గుర్తించి సముచిత స్థానం కల్పిస్తుందని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. వైఎస్సార్‌సీపీ బాపట్ల జిల్లా కమిటీలో రేపల్లె నియోజకవర్గం నుంచి స్థానం పొందిన పలువురు నాయకులు శుక్రవారం చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో గణేష్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికై పార్టీ నుంచి వచ్చే ఆదేశాలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. క్రమశిక్షణ కలిగిన నాయకునిగా మెలుగుతూ కార్యకర్త ఆత్మగౌరవం పెంపొందేలా పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా రేపల్లె నియోజకవర్గం నుంచి ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఎన్నికైన వై.శ్రీనివాసరావు, నిజాంపట్నం కోటేశ్వరరావు, బాపట్ల జిల్లా యాక్టివిటీ సెక్రటరీలుగా ఉయ్యూరు శాంతిరాజ్, పిట్టు సాంబశివరెడ్డి, అధికార ప్రతినిధిగా ఎన్నికైన కె.వెంకట కృష్ణారెడ్డిలను ప్రత్యేకంగా అభినందించారు. పార్టీ అభ్యున్నతికి అహిర్నిశలు కృషి చేయాలని పేర్కొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



నగరం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఆల్ ఇండియా బాడ్మింటన్ అసోసియేషన్ మాజీ డైరెక్టర్ డాక్టర్ కేసీహెచ్ పున్నయ్య చౌదరి చెప్పారు. స్థానిక ఎస్వీఆర్ఎం కళాశాలలో శుక్రవారం నిర్వహించిర క్రీడా దినోత్సవ వేడుకలలో పున్నయ్య చౌదరి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. క్రీడల్లో ప్రతిభ కనబర్చిన వారికి ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలలో రాయితీ వర్తిస్తుందన్నారు. విద్యార్థులు క్రీడల్లో రాణించి ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పలు క్రీడల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఆయన అభినందిచారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చియ్యచౌదరి, ప్రిన్సిపాల్ హరికృష్ణ, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బేతాళ ప్రకాష్‌పై అక్రమ కేసులు ఎత్తివేయాలి



రేపల్లె తాలూకా సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదుల నిరసన

రేపల్లె రూరల్: న్యాయవాదులపై అక్రమంగా కేసులు బనాయించటం, భౌతిక దాడులకు పాల్పడటం పోలీసులకు తగదని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేసన వెంకట గోపాలరావు అన్నారు. పొన్నూరులో న్యాయవాది బేతాళ ప్రకాష్‌రావుపై పోలీసులు పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కోర్టు విధులను బహిష్కరించి అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో మానవ హారం నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. గోపాలరావు మాట్లాడుతూ బేతాళ ప్రకాష్‌రావుపై పొన్నూరు పోలీసులు భౌతిక దాడులకు పాల్పడటం విచారకరమన్నారు. న్యాయవాదులపై పోలీసుల జులుం నశించాలని డిమాండ్ చేస్తూ ప్రకాష్‌రావుపై నమోదు చేసిన కేసును ఎత్తివేయాలని లేకుంటే బార్ ఫెడరేషన్ తీర్మానం అనుసరించి అక్రమ కేసును ఎత్తివేసే వరకు ఎటువంటి కార్యాచరణకైనా సిద్ధపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు భూషణం, కార్యదర్శి గిరిధర్, న్యాయవాదులు సాంబశివరావు, సూరిబాబు, పుప్పాల ఐజ్, కొండలరావు, కృష్ణ, మధుసూధనరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

బాలికల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం అవసరం



కొల్లూరులో కిశోర వికాసంపై సూచనలిస్తున్న వైద్యాధికారి




మాట్లాడుతున్న ఎంఈఓ ఐ.వెంకటేశ్వర్లు

కొల్లూరు : కిశోర బాలికల ఆరోగ్య పరిరక్షణ విషయంలో అధిక ప్రాధాన్యత ఇచ్చే విధంగా వారికి అవగాహన కల్పించి శారీరక, మానసిక దృఢత్వం సాధించడానికి కృషి చేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారి వి.కావ్య అన్నారు. శుక్రవారం అమృతలూరు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కిశోర బాలికా వికాసం కార్యక్రమంలో ఆమె అంగన్‌వాడీ కార్యకర్తలు, వెల్ఫేర్ అసిస్టెంట్స్, మహిళా పోలీసు, వైద్య సిబ్బందికి అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బాల్య వివాహాల నిర్మూలన, బాలికల అక్రమ రవాణా వంటి సంఘ వ్యతిరేక కార్యక్రమాలపై ప్రతి ఒక్కరికి వివరించి తగు జాగ్రత్తలు పాటించేందుకు తోడ్పాటును అందించాలని సూచించారు. యుక్త వయస్సుకు వచ్చిన బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు, పౌష్టికాహారం తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ నరసింహారావు, సీడీపీఓ జి.విజయలక్ష్మి, ఏసీడీపీఓ బి.విజయరాణి, సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, పజరున్నీసా, నగరాజకుమారి పాల్గొన్నారు.

కిశోర వికాసంపై సమావేశం

వేమూరు: ప్రపంచాన్ని మార్చగలిగే శక్తి బాలికలకు ఉందని అమర్తలూరు ప్రాజెక్ట్ సీడీపీవో విజయలక్ష్మి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో కిశోర వికాసంపై శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. మండల విద్యా శాఖాధికారి ఐ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బాలికల హక్కులను గుర్తించ గల్గినప్పుడు, వారి అవసరాలను తీర్చ గల్గినపుడు, వారు చెప్పేవి వినగల్గినపుడు, బాలికలు వారి కుటుంబాలను సమాజాన్ని , ప్రపంచాన్ని మార్చగల్గుతారన్నారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ విస్తరణాధికారి చొప్పర శేఖర్, బి.విజయరాణి, సూపర్‌వైజర్స్ కె.మాధవి, అమృతవాణి, నాగరాజు కమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వీఆర్వోలు విధులు సక్రమంగా నిర్వర్తించాలి



రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ నాంచారయ్య

నగరం: వీఆర్వోలు విధులు సక్రమంగా నిర్వర్తించాలని అలసత్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని తహసీల్దార్ నాంచారయ్య చెప్పారు. మండలంలోని పూడివాడ గ్రామంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వీఆర్వో అందుబాటులో ఉండటం లేదని తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో తహసీల్దార్ వీఆర్వో కోటేశ్వరరావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బలిజేపల్లిలో రెవెన్యూ సదస్సు

బలిజేపల్లి(వేమూరు): ప్రభుత్వం రైతుల సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని తహసీల్దారు సుశీల తెలిపారు. వేమూరు మండలంలోని బలిజేపల్లి గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో గ్రామంలో రైతులు అర్జీలు అందజేయక పోవడంతో రెవెన్యూ సిబ్బంది ఆశ్చర్యానికి గురయ్యారు. దీంతో రెవెన్యూ సదస్సును త్వరగా ముగింపు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు రవీంద్ర, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మున్నంగిలో యువకుడికి తీవ్రగాయాలు

మున్నంగి(కొల్లిపర): మండల పరిధిలోని మున్నంగిలో ఓ యువకుడుకి తీవ్ర గాయాలైన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కనపాల రవి స్థానిక వంతెన పై గురువారం రాత్రి అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గ్రామస్తులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. వారు ప్రైవేటు వైద్యశాలకు తరలించగా మెరుగైన వైద్యం కోసం మంగళగిరి ఎన్ఆర్ఐ వైద్యశాలకు తరలించారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెనాలి సీఐ బెల్లం శ్రీనివాసరావు తెలిపారు. సంఘటనా స్థలాన్ని గ్రామంలో పలుచోట్ల ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. ఆయన వెంట స్థానిక ఎస్ఐ పి.కోటేశ్వరరావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

మహిళాభ్యున్నతికి సావిత్రిబాయి సేవలు చిరస్మరణీయం



సావిత్రిబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు



సావిత్రిబాయి, జ్యోతిబా పూలే చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న పోస్టల్ సిబ్బంది



మాట్లాడుతున్న బీసీ సంక్షేమం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు



సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంపీపీ లలిత కుమారి, జెడ్పీటీసీ భాస్కరి



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పించిన ప్రధానోపాధ్యాయులు నిరీక్షణరావు

రేపల్లె రూరల్: మహిళాభ్యున్నతికి, మహిళల విద్యాభివృద్ధికి సావిత్రిబాయి పూలే సేవలు చిరస్మరణీయమని చేనేత సంఘం నాయకులు పట్టెం శ్రీనివాసరావు అన్నారు. మొదటి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి జయంతి సందర్భంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సమాఖ్య ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జ్యోతిరావు పూలే అడుగుజాడల్లో నడుస్తూ నిమ్న కులాల అభ్యున్నతితో పాటు మహిళా సమస్యలపై పోరాడిన వనిత అని కొనియాడారు. ప్లేగు వ్యాధిగ్రస్తులకు సైతం ఆమె సేవలు అందించారని, కరువు పరిస్థితుల్లో అనేక మందికి భోజన సదుపాయాలు సమకూర్చారని అన్నారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మైనార్టీ సమాఖ్య సభ్యులు నాగమల్లేశ్వరరావు, అమర్‌నాథ్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

- జై భీమ్‌రావ్ భారత్ పార్టీ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు దోవా రమేష్‌రాంజీ, కర్రా బాబూరావు, ఎస్.వెంకటరావు, పంతగాని నాగేశ్వరరావులు సావిత్రిబాయి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- బార్ అసోసియేషన్ సభ్యులు అంబేద్కర్ విగ్రహం వద్ద సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఓల్డ్ టౌన్‌లోని పోస్టాఫీసులో పోస్టల్ ఉద్యోగులు సావిత్రిబాయి పూలే, మహాత్మ జ్యోతిబా పూలే చిత్రపటాలకు పూలమాలలు వేశారు.

బొర్రావారిపాలెంలో...

నిజాంపట్నం మండలం బొర్రావారిపాలెంలో బీసీ సంక్షేమం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లింకా బుక్ అవార్డు గ్రహీత వల్లభనేని సత్యసాయిబాబును సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శివప్రసాద్, బడుగు వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

భట్టిప్రోలులో...

భట్టిప్రోలు: తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే నేటి మహిళ లోకానికి ఆదర్శమని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయ భాస్కరిలు పేర్కొన్నారు. భట్టిప్రోలు మండల విద్యా వనరుల కేంద్రంలో సావిత్రి బాయి పూలే జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి ఎంపీపీ లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు ఉదయ భాస్కరిలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ సామాజిక రుగ్మతలపై సావిత్రిబాయి పూలే పోరాటం చేశారని, మహిళా విద్యావ్యాప్తికి ఎనలేని కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.వెంకట రమణ, ఎంఈవో నీలం దేవరాజు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సీహెచ్ జలజ, ఈవోపీఆర్డీ టి.ఊహరాణి, సిబ్బంది కృష్ణకుమారి, సీఆర్పీలు పాల్గొన్నారు.

సావిత్రిబాయి జయంతిని ప్రతి ఒక్కరూ నిర్వహించాలి

అమర్తలూరు(వేమూరు): సంఘ సంస్కర్త విద్యావేత సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ప్రతి ఒక్కరూ నిర్వహించాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కనపర్తి నిరీక్షణరావు అన్నారు. అమర్తలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంటర్మీడియేట్ బోధిస్తున్న తుమాటి రత్నకుమారికి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సావిత్రబాయి పూలే బాలికల విద్య కోసం చేసిన కృషి మరవలేమన్నారు. ఈ కార్యక్రమంలో కంభంపాటి గిరి, ఉపాధ్యాయులు భ్రమర సురిశ్రీ, కె.ప్రసన్న కుమారి పాల్గొన్నారు.

వరికూటి అశోక్‌బాబుకు కృతజ్ఞతలు



వేమూరు: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి నిరంతరం కష్టపడి పని చేస్తానని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోగంటి లవకుమార్ అన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబును చెరుకుపల్లి గ్రామంలోని ఆయన స్వగృహంలో శుక్రవారం లవకుమార్ కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడి పదవిని వరికూటి అశోక్‌బాబు ఇప్పించడం జరిగిందన్నారు. వేమూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ కోసం పని చేస్తానని తెలిపారు. వరికూటి అశోక్‌బాబు ఆశీస్సులు ఉండాలని ఆయన కోరారు. కార్యక్రమంలో దున్నా మేరీసుబాబు, పడమటి శ్రీనివాసరావు, గుమ్మడి దానియేలు, కూచిపూడి మోషే, శ్రీక్రాంత్, వేమూరు నాని, కనపర్తి మోహనరావు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పేరలి సర్పంచ్‌గా ప్రమాణ స్వీకారం చేసిన వీరయ్య



వీరయ్యకు నియామక పత్రం అందజేస్తున్న డీఎల్‌పీవో శరత్‌బాబు, ఎంపీడీవో శ్రీనివాసరావు

కర్లపాలెం: మండలంలోని పేరలి గ్రామ సర్పంచ్‌గా గొర్రుముచ్చు వీరయ్య శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఇప్పటి వరకు పేరలి సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహించిన మల్లెల వెంకటేశ్వర్లును ప్రిన్సిపాల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి అనర్హుడిగా ప్రకటించి రెండవ స్థానంలో నిలిచిన గొర్రుముచ్చు వీరయ్యను సర్పంచ్‌గా నియమించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించటంతో ఆయన ఆదేశాల మేరకు డీఎల్‌పీవో పీడీఎస్ శరత్‌బాబు, ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావులు వీరయ్యకు నియామక పత్రం అందించి సర్పంచ్‌గా ప్రమాణ స్వీకారం చేయించారు. 2021 ఫిబ్రవరి 9న జరిగిన పేరలి పంచాయతీ ఎన్నికలలో గొర్రుముచ్చు వీరయ్యపై అదే గ్రామానికి చెందిన మల్లెల వెంకటేశ్వర్లు పోటీ చేసి 141 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందాడు. అయితే పంచాయతీ పరిధిలో ఉన్న 12 వార్డులలో ఏ వార్డులోనూ మల్లెల వెంకటేశ్వర్లుకు ఓటు హక్కు లేదని.. ఆధార్, రేషన్ కార్డులలో మల్లెల వెంకటేశ్వర్లు అని ఉండగా ఓటరు జాబితాలో మల్లెల ఆదాంగా ఉండటంతో ఎన్నికల నామినేషన్ పత్రాలలో తప్పుడు సమాచారం పొందుపరిచి గెలుపొందాడని అతన్ని అనర్హుడిగా ప్రకటించాలని గొర్రుముచ్చు వీరయ్య జిల్లా కోర్టును ఆశ్రయించటంతో విచారణ జరిపిన కోర్టు మల్లెల వెంకటేశ్వర్లును అనర్హుడిగా ప్రకటించి, రెండవ స్థానంలో నిలిచిన గొర్రుముచ్చు వీరయ్యను సర్పంచ్‌గా ప్రకటించాలని 2024 నవంబర్ 7వ తేదీన తీర్పునిచ్చింది. కాగా సర్పంచ్ ప్రమాణ స్వీకారం సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఎలాంటి ఆందోళనలు జరగకుండా కర్లపాలెం ఎస్ఐ ఎస్.రవీంద్ర సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

7న సర్వసభ్య సమావేశం

కర్లపాలెం: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 7వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ యారం వనజ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నామని ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సర్వసభ్య సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు గ్రామ, మండల స్థాయి అధికారులు పాల్గొంటారని ఎంపీడీవో తెలియజేశారు.

వివిధ చేతి వృత్తిదారులకు శిక్షణ తరగతులు

రేపల్లె రూరల్: పురపాలక సంఘం ఆధ్వర్యంలో వివిధ రకాల చేతి వృత్తిదారులను గుర్తించి వారికి నైపుణ్య సాంకేతిక శిక్షణనిచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్లంబర్, కార్పెంటర్, ఎలక్ట్రీషియన్, ఎయిర్ కండిషనర్ (ఏసీ), టెలివిజన్, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్ వంటి వాటి మరమ్మతుల వృత్తి పనులపై శిక్షణనివ్వటం జరుగుతుందన్నారు. ఆసక్తి గలవారు ఈ నెల 6వ తేదీ లోపు మెప్మా కార్యాలయంలో తమ వివరాలతో పాటు ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ ఫొటోలు, రేషన్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, పాన్‌కార్డు జిరాక్స్‌లతో పాటు విద్యార్హత, అనుభవ ధ్రువీకరణ పత్రాలు అందించాలని పేర్కొన్నారు.